## క్లుప్తంగా

### అంకితభావంతో సేవలు అందించండి

చీరాల టౌన్: గ్రామ స్థాయి సచివాలయాల ఉద్యోగులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.శివన్నారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కకీ ప్రభుత్వ సాయం అందించేలా చూడాలన్నారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలని కోరారు. హౌసింగ్ ఏఈశ్రీను, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

### మహిళల ఆర్థిక పురోగతి అవసరం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం కె.మధుసూదన్ సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల మండల సమాఖ్య వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ పొదుపు సంఘాల్లో మహిళలు విధిగా నెలవారీ వాయిదాల రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు.

### బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ నేడు

వేటపాలెం: చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం రామన్నపేట పంచాయతీ కార్యాలయం వెనుక గల సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి పార్టీ నియోజవర్గ నాయకులు అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నాలని కార్యాలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు.

### పండ్ల తోటల పెంపకంతో లాభాలు

చీరాల టౌన్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న ఇతర పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దాసు బుధవారం తెలిపారు. పండ్ల తోటల విరాల కోసం ఫీల్డు అసిస్టెంట్లను కలవాలన్నారు. మామిడి, సపోట, జామ, సీతాఫలం, జీడిమామిడి పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, బ్యాంకు ఖాతా నకళ్లతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### కత్తెర పురుగు నివారించుకోండి

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పైరుకు కత్తెరపురుగు ఆశించిందని సమగ్ర యాజమన్య పద్ధతులతో నివారించుకోవాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. బుధవారం కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లో సాగుచేసిన మొక్కజొన్న పైరును పరిశీలించారు.

### అర్చకుల సమస్యలు పరిష్కరించండి

చీరాల అర్బన్: దేవాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్చక సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దిట్టకవి వాసుదేవ సంపత్‌కుమార్ ఆచార్యులు, కోశాధికారి వేదాంతం కిరణ్‌కుమార్‌లు దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీరామచంద్ర మోహన్‌కు బుధవారం విన్నవించారు. అర్చకుల సమస్యలను ఆయనకు వివరించారు. అర్చకులకు బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్చకుల ఈనాం భూములకి అనుభవదారుగా పేరు నమోదు అవకాశం కల్పించి రైతులకి ఇచ్చే సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు.

### వీరన్నపాలెం గ్రామ నౌకరుగా జంగా అజయ్

పర్చూరు(చినగంజాం): వీరన్నపాలెం గ్రామ నౌకరుగా జంగా అజయ్ నియమితుడయ్యాడు. దీనికి సంబంధించిన కారుణ్య నియామక ఉత్తర్వులను బుధవారం పర్చూరు తహసీల్దార్ పి. బ్రహ్మయ్య అజయ్‌కు అందించాడు. గతంలో వీరన్నపాలెం గ్రామనౌకరుగా విధులు నిర్వహిస్తున్న జంగా ప్రభాకర్ ఈ ఏడాది మే 23 న మృతి చెందడంతో ఆయన కుమారుడు జంగా అజయ్‌కు కారుణ్య నియామక జాబితాలో అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న పశువైద్యశాల



డాక్టర్ గదిలో పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

# మూగ రోదన తీర్చేవారు లేరా?

- 50 సంవత్సరాల క్రితం నిర్మాణం
- ఇప్పటికీ కనీస మరమ్మతులు లేవు
- బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది, పశుపోషకులు

దగ్గుబాడు (కారంచేడు): పశు వైద్యశాల ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. 1976లో అప్పటి గ్రామ సర్పంచ్ మన్నె రామమూర్తి చొరవతో దగ్గుబాడులో నిర్మితమైన వైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియక అంతా హడలిపోతున్నారు. కొద్దిపాటి వర్షం కరిసినా పై కప్పు ఉరుస్తోంది. కంప్యూటర్లు, రికార్డులు తడిచిపోకుండా వాటిని కాపాడుకొనేందుకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. పై కప్పు పెచ్చులు ఊడి పడుతుండటంతో వైద్య పరీక్షలు చేయడానికి కూడా వైద్యులు, సిబ్బంది హడలిపోతున్నారు. డాక్టర్ బైట కూర్చోవాల్సి వస్తోంది. ఇప్పటికీ ఒక్కసారి కూడా మర్మతులు చేయకపోవడం శోచనీయం.



మందుల గది ఇలా..

**లక్ష్యం నెరవేరేదెలా?**

మొదట్లో ఎనిమిది గ్రామాలు ఈ వైద్యశాల పరిధిలో సేవలందించగా.. ప్రస్తుతం దగ్గుబాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం గ్రామాలకు పరిమితం చేశారు. వీటి పరిధిలో సుమారు 2000 పైగా పశు సంపదకు సక్రమంగా వైద్యశాలలు లేకపోవడంతో పశు కాపరులు ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్ళి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఇక్కడ రోజుకు 15–20 పశువుల ఓపీ చూస్తున్నారు.

**పశువైద్య సేవలకు ఆటంకం..**

పాడి, పశువులకు కేంద్రంగా ఉండే దగ్గుబాడులో రైతులు, పశుపోషకలు ఎక్కువ మంది ఉంటారు. రైతులందరికీ ఇంచుమించు పాడి ఉంటుంది. వీటి సంరక్షణకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ సమావేశంలో నూతన భవనం కావాలని.. అలాగే అధికారులకు కూడా మొరబెట్టుకున్నా.. ఎవరూ స్పందించడంలేదు.

**ఇబ్బందులు పడుతున్నారు**



గ్రామంలో పశుపోషకులకు అనువైన, అన్ని వసతులు కలిగిన పశువైద్యశాల లేకపోవడం వలన ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. పశుపోషకులతో పాటు, పశువైద్య సిబ్బంది కూడా చాలా అవస్థలు పడుతున్నారు.
– చుండి రాము

**పాములు తిరుగుతున్నాయి**



పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో రికార్డులు, కంప్యూటర్లు తడిచిపోతున్నాయి. కుర్చీ బైట చెట్టుకింద వేసుకొని వైద్యసేవలందిస్తున్నాం. పగలు.. రాత్రి తేడా లేకుండా తేళ్ళు, పాములు, విషపురుగులు కూడా సంచరిస్తుంటాయి. నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
– డాక్టర్ రవికుమార్, పశువైద్యాధికారి, దగ్గుబాడు

**నిధులు మంజూరు చెయ్యాలి**



ఇక్కడ అన్ని వసతులతో కూడిన ఆసుపత్రి ఉంటే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఎప్పటి నుండో ఈ సమస్య ఉంది. ఈ ఆసుపత్రి రోడ్డుకు కనీసం 5 అడుగుల లోతుగా ఉంటుంది. దీంతో వర్షాకాలం చాలా కష్టంగా ఉంది.
– ముల్లా నూర్‌అహ్మద్, మండల కోఆప్షన్ మెంబర్

## అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

కారంచేడు: అక్రమంగా రవాణా చేసే వస్తువులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం కారంచేడు గ్రామంలో వాడరేవు–పిడుగురాళ్ళ జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆటోలు, కార్లు, లారీలు వంటి హెవీ వెహికల్స్‌లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, హెరాయిన్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలను కూడా అక్రమంగా తరలించే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో పాటు, అధిక లోడుతో ప్రయాణించవద్దన్నారు.



కారంచేడులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ఖాదర్‌బాషా

## ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం

చీరాల అర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న బిట్రా జ్ఞాన వెంకట గణేష్‌కు చదువు నిమిత్తం బీరక వెంకట సుబ్బయ్య–పున్నమ్మ ఎడ్యుకేషన్ ట్రస్టు, చీరాల పక్షాన బీరం సుందరరావు, భాగ్యలక్ష్మి దంపతులు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు కుమార్తె, కుమారుడిని చదివించేందుకు ఇబ్బందులు పడుతుండటంతో ట్రస్టు తరుపున ఆర్థిక సహాయాన్ని అందించారు. పదో తరగతిలో 565 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 435 మార్కులు సాధించాడని, ప్రభుత్వం నుంచి తల్లికి వందనం సహాయం అందలేదని తల్లిదండ్రులు తెలిపారన్నారు. సీనియర్ ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి ఇంజినీరింగ్ చదవాలని తన ధ్యేయమని గణేష్ తెలిపారు.



గణేష్‌కు చదువు నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్న బీరం సుందరరావు

## ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

అద్దంకి: మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం ప్రపంచ యవజన నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థుల నైపుణ్యాలని వెలికి తీసే విధంగా వివిధ వృత్తి ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులను నైపుణ్యం పట్ల అవగాహన పెంపొందించడం వారి భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేయడం, కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఉపాధ్యాయులన్నారు. అనంతరం చిత్రలేఖన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. శివరామకష్ణ, ఎస్‌కే అలీ, వి. యలమంద కార్యక్రమాన్ని నిర్వహించారు.



ధ్రువపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

## రాంకూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడికి సన్మానం

పంగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని రాంకూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన అడ్డగడ్డ ఆంజనేయులును బుధవారం మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు సన్మానించారు. కార్యక్రమంలో జంపాన్‌రాజా, పటానఖ మౌలాలి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టకొయ్య మహేష్, మండల రైతు విభాగం అధ్యక్షుడు అడ్డగడ్డ వెంకయ్య, మానం దానయ్య, ముప్పనేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆంజనేయులును సన్మానిస్తున్న మండల కన్వీనర్

## పార్టీ బలోపేతానికి కమిటీల ఎంపిక



వల్లాపల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎంపికైన ఇస్మాయిల్

బల్లికురవ: వైఎస్సార్ సీపీని గ్రామాల వారీగా బలోపేతం చేసేందుకే గ్రామ, బూత్ కమిటీల ఎంపిక చేస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని వల్లాపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో కమిటీలను ఏక్రీవంగా ఎంపిక చేశారు. గ్రామాల వారీగా కమిటీ ఎంపిక పూర్తి కాగానే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోని తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసే వరకు పోరాటం ఆగదని చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా షేక్ ఇస్మాయిల్, బొంతు ఏసోబు, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బిరుదు ఇసాక్, రావినూతల నాగార్జున, మేదర వంశీ మరో 20 మంది సభ్యులను ఎంపిక చేశారు. స్థానిక నేతలు మంచాల శ్రీనివాసరెడ్డి, గొట్టిపాటి వెంకటరావు, మేడగం శ్రీనివాసరెడ్డి, షేక్ అబ్దుల్లా, అవిశెన కొటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యం కాపాడాలి



వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎం అండ్‌హెచ్‌ఓ విజయమ్మ

చినగంజాం: చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్. విజయమ్మ సూచించారు. బుధవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వైద్యశాలలోని ఆరోగ్య సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. కుష్టు,టీబీ కేసులకు వైద్యచికిత్సను కొనసాగించాలని సూచించారు. 104 వాహనం ద్వారా ఎక్కువ మందిక సర్వీసులు అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి. సాయిశ్రీచరణ్, డాక్టర్ సిరివెన్నెల, 104 నోడల్ ఆఫీసర్ బీవీ బ్రహ్మం, వైద్య ఆరోగ్య సిబ్బంది, చిరంజీవి, మురళి, ఆశలు, 104 డీఏ పొదిలి రాఘవ పాల్గొన్నారు.

### మైనార్టీలకు హామీలు నెరవేర్చాలి

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వం ముస్లీం మైనార్టీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి బుధవారం డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 50 ఏళ్ల దాటిన మైనార్టీలకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందని , అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చలేదనన్నారు. కనీసం అందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా మంజూరు చేయలేకపోవడంతో ఆందోళన చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆరునెలలకు ఒకసారి పింఛన్లు మంజూరు చేశారని గుర్తు చేశారు.

### పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అన్నంబొట్ల వారిపాలెంలో పరిశీలిస్తున్న జిల్లా స్వచ్ఛ రక్షణ బృందం

పర్చూరు(చినగంజాం): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ తెలిపారు. బుధవారం చెన్నుబొట్లవారిపాలెంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025కు సంబంధించిన జిల్లా బృందం సభ్యులు పాల్గొని గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్వాహణ, మురుగు నీటి పారుదల వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు పరిశీలించారు. కోటేశ్వరరావు, జిల్లా బృంద సభ్యులు పాల్గొన్నారు.

### శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం ఉత్తరాభాద్ర సప్తమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

### రెడ్ బుక్ రాజ్యాంగం అవాస్తవం

చీరాల: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారనేది అవాస్తవమని, బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్నే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి కె.పార్థసారధి అన్నారు. బుధవారం చీరాల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ విద్వేష రాజకీయాలు చేస్తోందన్నారు.

## టీబీకి చికిత్స తీసుకోండి

అద్దంకి: టీబీ వ్యాధికి ఆరోగ్య శాఖ ఇచ్చే మందులతో వ్యాధి పూర్తిగా నయం అవుతుందని 104 వైద్యుడు డాక్టర్ శ్రీహర్ష అన్నారు. మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మాయపాలెంలో బుధవారం క్యాంపును నిర్వహించారు. టీబీ డిపార్టుమెంటు నుంచి మనం వందరోజుల టీబీ ముక్త్ భారత్ ప్రోగ్రాం గురించి వివరించారు. టీబి లక్షణాలను తెలియజేశారు. టీబీ మందులు వాడే వారికి నిక్షయ్ పోషణ యోజన నిమిత్తం నెలకు వెయ్యి రూపాయలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కోఆర్డినేటర్, అద్దంకి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రాజశేఖర్, 104 సిబ్బంది , ఆశాలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

## పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ

ఆదిపూడి (కారంచేడు): శుద్ధమైన తాగునీరు, పరిశుభ్ర వాతావరణ పరిస్థితులను కల్పించడమే ప్రధాన లక్ష్యం అని ఎస్ఎస్‌జీ సెంట్రల్ బృందానికి చెందిన డి. చందు అన్నారు. బుధవారం ఆదిపూడిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, ప్రభుత్వ భవనాల్లో మరుగుదొడ్ల పరిస్థితి పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సెల్వ, ఎంపీడీఓ కె. నేతాజీ, గ్రామ సర్పంచ్ ఎన్. నాగరాజు, ఈఓపీఆర్డీ రాంమ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్, హౌసింగ్ ఏఈ షేక్ ఖాసీం సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు ఎల్‌కే కృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆదిపూడి పంచాయతీ పరిశీలిస్తున్న ఏఎంఎస్ సెంట్రల్ టీం సభ్యులు

## 19 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

అద్దంకి రూరల్: ఈనెల 19 నుంచి అద్దంకి పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల మానవాళికి జరుగుతున్న నష్టాలను వివరించారు. వ్యాపారులు, పట్టణ ప్రజలు ప్లాస్టిక్ సంచుల సంపూర్ణ నిషేధానికి సహకరించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. బలరామిరెడ్డి, శానిటేషన్ సెక్రటరీ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్ల అమ్మకందారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

## ఇంజినీరింగ్ కార్మికుల వంటా వార్పు



వంట చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

అద్దంకి: తమ డిమాండ్ల సాధన కోసం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి నాలుగో రోజులకు చేరింది. నాలుగో రోజు కార్మికులు మునిసిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలోనూ వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడే వండుకుని భోజనాలు చేశారు. సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేసినా, నిరసనలు తెలియజేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా , కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. కార్మికులకు మేలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎన్నికల నిర్వహణపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో ఇంకొల్లు మండల బీఎల్‌ఓలు

ఇంకొల్లు(చినగంజాం): ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇంకొల్లు మండల పరిధిలోని బీఎల్వోలకు బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ పొందిన ఏఎస్ఓ శ్రీమన్నారాయణ బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై బీఎల్‌ఓలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. యాప్‌లో ఏవిధంగా నమోదు చేయాలో శిక్షణ ఇస్తూ ఎలక్ట్రోరల్ జాబితాను ఏ విధంగా శుద్ధీకరణ చేయాలి, ఇంటింటికి సర్వే నిర్వహించే కార్యక్రమంలో డ్రెస్ కోడ్ ఎలా ఉండాలో స్కిట్ రూపంలో ప్రదర్శించారు. బీఎల్‌ఓలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మాధవీ లత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.